క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు

విజయనగరం: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ డీఈలు, ఏఈలు సోమవారం పరిశీలించారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు 18 నంబర్ సచివాలయ పరిధి రాజారావుమేడ ప్రాంతంలో జరుగుతున్న కల్వర్టు గోడల నిర్మాణ పనులను ఏఈ పరిశీలించారు. అలాగే 55వ నంబర్ సచివాలయ పరిధి కేఎల్ పురం ప్రాంతంలో ఉన్న వాటర్‌ట్యాంక్ రోడ్డు వద్ద పైపు కల్వర్టు పనులు చేపడుతున్నారు. 8వ డివిజన్ అయ్యకోనేరు దక్షిణ గట్టు ప్రాంతంలో సీసీ డ్రెయిన్ పనులు, 17వ డివిజన్ రాజీవ్ స్టేడియం ఆవలి గేటు వద్ద కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

సకాలంలో వైద్యసేవలు

- డీఎంహెచ్‌ఓ జీవనరాణి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ జీవనరాణి అన్నారు. సోమవారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం లేబరేటరీని తనిఖీ చేసి రోజుకి ఎంతమంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు.. ఎంతమందికి టెస్టులు చేస్తున్నారు.. తదితర వివరాలపై ఆరా తీశారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయాలన్నారు.

పుట్టుకతో లోపాలు గల పిల్లలను గుర్తించాలి

- డీఎంహెచ్‌ఓ జీవనరాణి



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: పుట్టుకతో లోపాలు గల పిల్లలను గుర్తించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి తెలిపారు. ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్‌లో భాగంగా 1 నుంచి 18 ఏళ్ల గల పిల్లల్లో లోపాలను గుర్తించి రవాణా చేసేందుకు రిఫరల్ వాహనాన్ని సోమవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, డీఎంఓ మణి తదితరులు పాల్గొన్నారు.

చారికి జీవిత సాఫల్య పురస్కారం



జీవితకాల సాఫల్య పురస్కారం అందుకుంటున్న చారి

విజయనగరం టౌన్: ప్రముఖ ఇంద్రజాలకుడు చారికి ఇంద్రజాలంలో జీవిత సాఫల్య పురస్కారం వరించింది. ఆదివారం రాత్రి విశాఖ కళాభారతి ఆడిటోరియంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇండియన్ మ్యాజిక్ అకాడమీ వారు అవార్డు అందజేశారు. ఈ మేరకు చారి సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. తనతో పాటు దేశ, విదేశాలకు చెందిన తొమ్మిది మంది మెజీషియన్లు, ఇంద్రజాల పితామహుడు పీసీ సర్కార్ (జూనియర్)లను సత్కరించారని చెప్పారు. కార్యక్రమంలో వీసీ జీఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే ఆర్థిక ప్రణాళిక



ముఖ్య వక్త శ్రీను దంపతులను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ఆర్థిక ప్రణాళిక నైపుణ్యం విద్యార్థి దశ నుంచే పెంచుకోవాలని సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెక్యూరిటీస్ మార్కెట్ ట్రైనర్ డాక్టర్ ఎం.శ్రీను అన్నారు. సోమవారం స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో 'ఇంట్రడక్షన్ టు ఫైనాన్షియల్ ప్లానింగ్' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు డబ్బు పెట్టుబడి పెడితే దానికి ముందుగా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్య వక్త దంపతులను సత్కరించారు. కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ సాయిదేవమణి, ఎం.సత్యవేణి, శ్రీనివాసరావు, సీహెచ్ రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో.. జ్ఞానజ్యోతి కాంతులు

- కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ
- చిన్నారులకు నాణ్యమైన విద్య అందించే దిశగా అడుగులు
- పూర్తికానున్న మొదటి విడత శిక్షణ



జ్ఞానజ్యోతి కార్యక్రమంలో శిక్షణ తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పూసపాటిరేగ: జ్ఞానజ్యోతి కార్యక్రమంతో అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు మెరుగైన విద్య అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఈక్రమంలో సిబ్బందికి కొద్ది రోజులుగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 120 రోజుల పాటు జరగబోయే శిక్షణలో భాగంగా మొదటి ఆరు రోజుల శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చదువులు కొత్తరూపుదిద్దుకోనున్నాయి. జాతీయ విద్యా విధానంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు చేయడానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు 272 ఉండగా వాటిలో 210 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 62 మిని అంగన్‌వాడీ కేంద్రాలు. ఆయా కేంద్రాల ద్వారా 1071 మంది గర్భిణులు, 911 మంది బాలింతలు, ఆరు నెలల్లోపు చిన్నారులు 920 మంది, ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు పిల్లలు 4210, మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులు 3055 మంది వరకు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో అభివృద్ధి చేశాయి. ఆరు సంవత్సరాల వయస్సు వరకు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో విద్య అందించడంతో పాటు మెనూ పకడ్బందీగా అమలు చేశారు. నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రతి కేంద్రంలో ఉన్న చిన్నారులకు కావాల్సిన ఆట వస్తువులు పంపిణీ చేశారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం..

భోగాపురం సెక్టార్ పరిధిలో గల పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాలకు చెందిన 272 మంది కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణలో పాల్గొన్నారు. మొదటి విడత శిక్షణను ఇప్పటి వరకు విజయవంతంగా పూర్తి చేశారు. శిక్షణలో భాగంగా సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి 120 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో ఆటపాటల ద్వారా బోధన ఎలా చేపట్టాలో అవగాహన కల్పిస్తున్నారు.

లక్ష్యాలు ఇవే..

పిల్లలను సంరక్షించడం, శారీరక, సామాజిక భావోద్వేగంగా అభివృద్ధి చెందేలా చూడడం. అక్షరాస్యతతో భవితకు భరోసా ఇవ్వడమే జ్ఞానజ్యోతి లక్ష్యాలు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు 1, 2 తరగతుల ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంపొందించడంలో భాగంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఉపయోగపడనుంది.

సమర్థవంతంగా శిక్షణ..



అంగన్‌వాడీ కేంద్రాలలో నాణ్యమైన విద్య అందించడానికి జ్ఞానజ్యోతి కార్యక్రమం దోహదపడుతుంది. ఆటపాటల బోధనతో చిన్నారులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధించడంపై శిక్షణ ఇస్తున్నాం. కార్యకర్తలు కూడా శ్రద్ధగా నేర్చుకుంటున్నారు.

– బి. శంకరరావు, హెచ్‌ఎం, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, పూసపాటిరేగ

ఉపయోగకరం..



శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. కేంద్రాలలో చిన్నారులకు వినూత్న బోధన అందించడానికి శిక్షణ ఉపకరిస్తుంది. శిక్షణ అనంతరం మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

– చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్త, వెంపడాం

కార్పొరేట్‌కు దీటుగా..



చిన్నారులకు కార్పొరేట్ స్థాయిలో బోధించేలా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నాం. జిల్లా స్థాయిలో శిక్షణ పొంది వారు మండలాల్లో కార్యకర్తలకు అవగాహన కల్పిస్తారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంతో కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తాయి.

– సత్యవతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, భోగాపురం సెక్టార్

పార్టీ బలోపేతంలో నూతన నాయకత్వానిదే కీలక బాధ్యత



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుతో విజయనగరం, నెల్లిమర్ల నియోజక వర్గాల నాయకులు

- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: సంస్థగతంగా పార్టీ బలోపేతంలో నూతన నాయకత్వం కీలకపాత్ర పోషించాలని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు సూచించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో చేపట్టిన నూతన నియామకాల్లో భాగంగా పదవులు పొందిన విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు మజ్జి శ్రీనివాసరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛాలు ఇచ్చి, శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు మోసపూరిత హామీలిచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల తరఫున పోరాటం చేసే బాధ్యతను ప్రతిపక్ష నాయకులుగా తీసుకోవాలని సూచించారు. పార్టీలో నాయకుల మధ్య చిన్న చిన్న అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ వాటిని సమన్వయ పరుచుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. పార్టీ సిద్ధాంతాలు, అధినేత ఆదేశాలను తప్పక పాటిస్తూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ కార్పొరేటర్ శెట్టి వీర వెంకట రాజేశ్వరరావు, పూసపటిరేగ ఎంపీపీ పతివాడ అప్పలనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడు, నగర అధ్యక్షుడు ఆశపు వేణు, సర్పంచ్ కునుకు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న 108 ఉద్యోగులు

- 108 ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: గతేడాది నవంబర్ నెలలో 108 ఉద్యోగులతో జరిగిన చర్చల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని 108 ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు వేమలి అప్పనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. జిల్లా కేంద్రంలో ఇంటర్ ఫెసిలిటి ట్రాన్స్‌పోర్ట్ కేసుల తరలింపునకు రెండు అంబులెన్సులు ఇస్తామని చెప్పినా, ఇంతవరకు అతీగతీ లేదన్నారు. ఉద్యోగులకు జీతం పెంచుతామన్న హామీ కూడా నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియామకాల్లో 108 ఉద్యోగులకు వెయిటేజీ మార్కులకు సంబంధించి ఇంతవరకు ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదని చెప్పారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బోని వెంకటరమణ, సతీష్, పుష్పవతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండల పరిధిలోని షెడ్యూల్ ఏరియా పంచాయతీల సమస్యలను పరిష్కరించాలని 15 గ్రామాల సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను అధ్యయనం చేయాలని కోరారు. దీనికి డీవీజీ స్పందిస్తూ త్వరలోనే గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. చైర్మన్‌ను కలిసిన వారిలో సర్పంచ్‌లు సోము లచ్చయ్య, ఎం.సింహాచలం, కె.రామయ్య, డి.లచ్చయ్య, తిరుపతిరావు, తదితరులున్నారు.

సర్వే చేపట్టి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వండి



చనమల్లుపేటలో విచారణ చేపడుతున్న ఆర్డీఓ దాట్ల కీర్తి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని చనమల్లుపేట గ్రామంలో ఆర్డీఓ దాట్ల కీర్తి సోమవారం పర్యటించారు. తన భూమిని ఆన్‌లైన్ చేయడం లేదని, వీఆర్వో లంచం అడుగుతున్నాడని ఆరోపిస్తూ రైతు చనమల్లు అబద్ధం ఇటీవల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ అంబేడ్కర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీఓ దాట్ల కీర్తి గ్రామాన్ని సందర్శించి రైతుతో మాట్లాడారు. రైతు సాగు చేస్తున్న భూమి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాగు చేస్తున్నప్పటికీ ఎటువంటి రిజిస్ట్రేషన్ పత్రాలు లేవని రైతు ఆర్డీఓకు వివరించారు. వ్యవహారంపై విచారణ చేపట్టి నివేదికను సమర్పించాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శనరావు, మండల సర్వేయర్ వేణుగోపాలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పూల్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయలక్ష్మీనగర్, ఇప్పిలివీధి, కొత్తపేట గొల్లవీధి, అద్దేపల్లివారి వీధి, గుంటూరు వారి వీధి, కల్కి భగవాన్ టెంపుల్ ఏరియా, టూటౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశు వ్యాధుల నివారణకు కృషి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: పశువ్యాధుల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ అన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 30 వరకు జిల్లాలో పశువ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు వాల్‌పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ జేడీ వైవీ రమణ కార్యక్రమంలో మాట్లాడుతూ గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు, బ్రూ సెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించి, వ్యాధుల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, ఉద్యానవనశాఖ డీడీ జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి

విజయనగరం టౌన్: నగరపాలక సంస్థ పరిధి 19వ డివిజన్ లంకాపట్నంలో నిర్మించిన హుద్‌హుద్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైట్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గృహ నిర్మాణ సంస్థ, నగర పాలక సంస్థ సంయుక్తంగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో హౌసింగ్ మేనేజర్ అప్పారావు, లబ్ధిదారులు ఎర్రమ్మ, లక్ష్మి, పోలమ్మ, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి

నెల్లిమర్ల రూరల్: నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని ఎస్సై గణేష్ కోరారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో భాగంగా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో మండల వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో షాపుల యజమానులు, గ్రామ పెద్దల సహకారంతో కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం సులువవుతుందన్నారు.

మాంసం విక్రయాలు నిషేధించాలి



హిందువులంతా భక్తిశ్రద్ధలతో జరుపుకునే మహాశివరాత్రి పర్వదినాన మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాంసం విక్రయాలను నిషేధించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు మద్దిల సోంబాబు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

పోస్ట్ కార్డు ఉద్యమం



ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్)ను రద్దుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నెల్లిమర్ల మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన సీఐటీయూ అనుబంధ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుకు పోస్ట్‌కార్డులు రాశారు. ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆప్కాస్ రద్దుచేస్తే ఉద్యోగులు కాంట్రాక్టర్ల ఆధీనంలోకి వెళ్లిపోతారని.. జీతాలు సక్రమంగా అందక ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు శ్రీను, బాబురావు, లక్ష్మి, హరిబాబు, రాము, బాల, తదితరులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల

వేడుకగా సాంకేతికోత్సవం..



జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో 'ఐటీవైయూకేటీపీ 2కే25' పేరుతో సోమవారం నిర్వహించిన సాంకేతికోత్సవం వేడుకగా జరిగింది. యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డి. రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరైన సదస్సులో విశాఖ ఐఆర్ఎస్ఎం ఈఎస్‌కి చెందిన ప్రత్యేక ఆర్థిక మండలి జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాలా ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'చాట్ – బాట్ డవలప్‌మెంట్' అనే అంశంపై డాక్టర్ టి.శివరామ కృష్ణ, ప్రొఫెసర్ అనిల్ పురిటీ వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం ముఖ్యవక్తను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వి.సతీష్‌బాబు, జి.జయసుమ, రాజేశ్వరరావు, బిందు మాధురి, అధ్యాపకులుక, విద్యార్థులు పాల్గొన్నారు. – విజయనగరం అర్బన్

కార్మికుల గోడు వినపడదా..?

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ

విజయనగరం గంటస్తంభం: ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి, శాలువాలు కప్పి ఎంతో ప్రేమాభిమానాలు ఒలకబోస్తూ ఫోటోలకు ఫోజులిచ్చిన పాలకులకు ప్రస్తుతం కార్మికుల గోడు వినబడడం లేదా అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రశ్నించారు. ఈమేరకు పాలకుల తీరుకు నిరసనగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు నేతృత్వంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు సోమవారం ఉదయం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆరు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేయగా, అప్పటి ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి ఒక కమిటీ వేసిందన్నారున. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారం చేబట్టి ఎనిమిది మాసాలు గడిచినా ఇంతవరకు ఎటువంటి న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఏటీయూసీ ప్రతినిధి ఎస్.రంగరాజు మాట్లాడుతూ... మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత – నిర్వహణ, సాంఘిక భద్రత వంటి అంశాలను పూర్తిగా మున్సిపల్ శాఖే చూసుకోవాలన్నారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సరండర్ లీవ్‌లు, మూడు డీఏలు సత్వరమే విడుదల చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అసిస్టెంట్ కమిషనర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగడుగుల కామేష్, క్లాప్ వెహికల్ డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు తుపాకుల శ్రీను, కార్యదర్శి కళ్యాణం శ్రీను, కార్యదర్శి దలాయ శ్రీను, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మార్చి 10న చలో అచ్యుతాపురం



చలో అచ్యుతాపురం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: మండలంలోని అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ని ఎత్తివేయాలని కోరుతూ మార్చి 10న చలో అచ్యుతాపురం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విజయదుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ (ఏఐఎఫ్‌టీయూ న్యూ అనుబంధ సంస్థ) అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక కార్యాలయం ఆవరణలో చలో అచ్యుతాపురం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో వేదాంత మల్టీ నేషనల్ ప్రైవేట్ కంపెనీకి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీచేసే విధానాన్ని కట్టబెడుతూ విజయనగరం జిల్లా అచ్యుతాపురంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫిట్‌నెస్ సెంటర్‌లను ఏర్పాటు చేయకుండా.. విజయనగరం జిల్లాలో పెట్టడమనేది ఆటో కార్మికుల పట్ల గుదిబండగా మారిందన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు సర్టిఫికెట్లు జారీ చేసే అధికారం ఇవ్వడం అవినీతిని పెంచి పోషించినట్లేనని అభిప్రాయపడ్డారు. ఫిట్‌నెస్ సెంటర్ యాజమాన్యం ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై చలానా రూ. 860 ఉంటే ఆటోడ్రైవర్ దగ్గర అదనంగా రూ. 2440 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ సెంటర్‌ను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బాలి సన్యాసిరావు, చెన్నా ధర్మారావు, కంది రాము, తర్లాడ శ్రీధర్, గేదెల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని కాపాడాలి

- రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు అప్పారావు



మాట్లాడుతున్న రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ అధ్యక్షుడు మజ్జి అప్పారావు

విజయనగరం టౌన్: రోడ్డు ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని తక్షణమే కాపాడాలని రోడ్డు సేఫ్టీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు తెలిపారు. తోటపాలెం గాయత్రీ కళాశాలలో రోడ్డు సేఫ్టీపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని కాపాడితే వారికి గుడ్ సమారిటన్ పథకం కింద నగదు ప్రోత్సాహకం అందిస్తామన్నారు. జిల్లా ప్రాంతీయ రవాణాశాఖ అధికారి శ్రావ్య మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్సై చిన్నంనాయుడు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపవద్దని, అతివేగం ప్రమాదకరమన్నారు. అనంతరం విద్యార్థులతో రహదారుల భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.గౌరీశ్వరి, జిల్లా రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ సభ్యులు ఎర్రినాయుడు, ఎస్.నారాయణరావు , కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.